క్లుప్తంగా

ఊలాల్ దేవుడికి ఆహ్వానం


అగ్ని కాగడాలతో ఊరేగుతున్న దృశ్యం

మందస: పోలాల అమావాస్య నుంచి చలికాలం ప్రారంభమవుతోందని ప్రజలు విశ్వసిస్తారు. ఇందులో భాగంగా చలి కాలాన్ని ఆహ్వానిస్తూ ఊలాల్ దేవుడు పేరుతో మందస మండల కేంద్రంలో సోమవారం రాత్రి అగ్ని కాగడాలు, అగ్గి బిండలను వెలిగి ప్రజలు ఊరేగారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని సంప్రదాయాన్ని కొనసాగించారు.

ఇత్తడి మకరతోరణం వితరణ


అమ్మవారికి బహూకరించిన మకరతోరణం

కవిటి: గొండ్యాల పుట్టుగలోని భూలోకమాత అమ్మవారికి భక్తులు ఇత్తడి మకర తోరణాన్ని వితరణగా అందించారు. కవిటికి చెందిన వ్యాపారవేత్త పాండవ రామారావు, స్థానికులు ఐ.గడ్డెమ్మ, డి.లోకనాథం, బి.చలపతి, కె.బాబూరావు ఆర్థిక సహకారంతో ఒడిశాలో తయారీ చేయించిన మకరతోరణాన్ని ఆలయ ప్రతినిధులకు అందజేశారు.

స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్‌కు విద్యుత్ స్తంభాలు వేయాలని అక్కడ ప్రజలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ నడిపేన రామారావుకు వినతిపత్రం అందజేశారు.

యూరియా సరఫరా చేయాలి

కంచిలి: యూరియా, డీఏపీ దొరక్క రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని కంచిలికి చెందిన కంచమ్మతల్లి రైతు ఉత్పత్తి సంస్థ ప్రతినిధులు అన్నారు. సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే జిల్లా ఉద్యాన శాఖ అధికారి, వ్యవసాయ సంయుక్త సంచాలకులను కలిసి రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలు అందజేయాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు.

అక్కడ నర్సులే డాక్టర్లు!

- కొర్లాం పీహెచ్‌సీకి వైద్యులు కరువు
- వైద్య సేవలు అందక రోగులు ఇక్కట్లు

సోంపేట:

కూటమి ప్రభుత్వ పాలనలో వైద్యం గగనమైంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు అండగా ఉండాల్సిన పీహెచ్‌సీలు సిబ్బంది లేమితో కూనారిల్లుతున్నాయి. ప్రధానంగా తగినంతమంది డాక్టర్లు లేక రోగులు మెరుగైన వైద్యానికి దూరమవుతున్నారు. దీనికి సోంపేట మండలంలోని కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు, పూర్తిస్థాయి సిబ్బంది ఉండేవారు. దీంతో ఈ ప్రాంత పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆరు నెలలుగా ఒక్క వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వస్తున్న రోగులకు నర్సులే వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో రూ. 60 లక్షలతో అత్యాధునిక పరికరాలతో రక్తపరీక్షా కేంద్రాన్ని పీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. దీంతో రోగులకు రక్త పరీక్షలు ఉచితంగా చేయించుకునే వెసులుబాటు కలిగింది. అయితే ప్రస్తుతం వైద్యులు కరువవ్వడంతో మెరుగైన వైద్య సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14 సచివాలయాల ప్రజలకు ఇదే దిక్కు..

మండలంలోని 14 సచివాలయ పరిధిలోని రోగులకు కొర్లాంలోని పీహెచ్‌సీనే దిక్కు. గిరిజన గ్రామ పంచాయతీలైన సుంకిడి, ఎంజీపురం, బుసాబద్రతో పాటు బేసిరామచంద్రాపురం, పాలవలస, పాత్రకొండ, కర్తలిపాలెం పంచాయతీల్లోని రోగులు ఎక్కువగా ఈ పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు అందుకుంటారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యానికి గురైందని ఆయా పంచాయతీల ప్రజలు వాపోతున్నారు. పేదల వైద్యం పట్ల పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.


కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ల్యాబ్

ఇద్దరు వైద్యులు బదిలీ..

ఆరు నెలల క్రితం వరకూ ఇక్కడ ఇద్దరు వైద్యులు సేవలు అందించేవారు. ఆ తరువాత బట్టిగళ్లూరు పీహెచ్‌సీకి ఒకరు, ఇంకొకరు కంచిలి మండలానికి బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఖాళీలను అధికారులు భర్తీ చేయలేదు. మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ మంది కుక్క, పాము కాట్లకు గురవుతుంటారు. వీరంతా కొర్లాం పీహెచ్‌సీనే వైద్యం కోసం ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం వైద్యుల్లేకపోవడంతో ఆయా పంచాయతీల ప్రజలు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపేట సామాజిక ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది. దీంతో కొంతమంది ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి ప్రాణాపాయం తలెత్తుతుంది. అదే దగ్గర్లో ప్రథమ చికిత్స అందితే కొంత వరకు ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

మండలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వ్యాధులబారిన పడుతున్నవారు పీహెచ్‌సీలో వైద్యం కోసం వెళ్తుండగా అక్కడ డాక్టర్లు లేకపోవడంతో నిరాశతో ప్రైవేటు ఆస్పత్రులు.. లేదా ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించి వైద్యం కోసం అధికంగా డబ్బును ఖర్చు చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు స్పందించి కొర్లాం పీహెచ్‌సీకి పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలని కోరుతున్నారు.

వైద్యుల్లేక పోవడం దారుణం



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. గత ప్రభుత్వం వైద్యం, విద్యపై ప్రత్యేక దృష్టిపెట్టి మెరుగైన సేవలు అందించింది. కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, వైద్యులను నియమించి రోగుల ఇక్కట్లు తీర్చింది. ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రోగులకు వైద్యం అందకుండా పోయింది.

–శిలగాన భాస్కరరావు, సుంకిడి సర్పంచ్

ఆర్థికంగా ఇబ్బందులు



గిరిజన పాంతల్లోని రోగులకు కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే దిక్కు. ప్రస్తుతం వైద్యుల్లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే ఇద్దరు వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలి.

– ఎస్.హరీష్‌కుమార్, సర్పంచ్, ఎంజీపురం

వైద్యులను నియమించాలి



కొర్లాం పీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాలవలస, కర్తలిపాలె, కొర్లాం, మాకన్నపురం, బసాబద్ర, పాత్రకొండ తదితర గ్రామాలకు చెందిన రోగులకు వైద్యం కరువైంది. అధికారులు, ప్రభుత్వ స్పందించి తక్షణమే వైద్యులను నియమించాలి.

–మర్ల హేమలత, సర్పంచ్, పాలవలస

కొత్తమ్మతల్లి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

టెక్కలి: కోటబొమ్మాళి మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా కె.గోవిందరావు, సభ్యులుగా ఎస్.గణపతిరావు, కె.అప్పలరాజు, ఎం.వెంకట్రావు, పి.ఇందువదన, పి.కౌసల్య, ఎ.యశోద, సీహెచ్ శోభారాణి తదితరులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ బి.శేషగిరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కె.హరివరప్రసాద్, బోయిన రమేష్ ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వైద్యశిబిరం

టెక్కలి రూరల్: విభిన్న ప్రతిభావంతులైన ఆరు నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు స్థానిక తెంబూర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో వైద్య, సాంకేతిక బృందంచే ప్రత్యేక వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల నుంచి 103 మంది దివ్యాంగులైన చిన్నారులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి అవసరమైన ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలకు ఎంపిక చేశారు. సమగ్రశిక్షా ఏపీసీ డాక్టర్ శశిభూషణ్, నాలుగు మండలాల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు బి.గోవిదరావు, వి.ఉమా, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని.. దానిని సంరక్షించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు టెక్కలి తహసీల్దార్ సత్యంకి సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో కూడా కొంత మంది పాఠశాల స్థలాన్ని ఆక్రమిచి నిర్మాణాలు చేపట్టగా.. తాజాగా మరికొంతమంది వాహనాలు పార్కింగ్ పేరిట స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో చీకటిపడితే అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని వివరించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజ్, మండల ప్రధాన కార్యదర్శి శాసనపురి శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: విద్యార్థుల విజయసాధనలో స్వీయ విశ్వాసం, క్రమశిక్షణ, కృషి, సానుకూల దృక్పథం ఎంతో అవసరమని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.ఎస్.జి.మురళీక్రిష్ణ అన్నారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి ఏడాది బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీసీఏ విద్యార్థులకు మోటివేషన్ తరగతులను సోమవారం నిర్వహించినట్లు కాళాశాల డైరెక్టర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన మురళీక్రిష్ణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్ కేరీర్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమంచేందుకు నైపుణ్యాలు, దృఢ సంకల్పం అవసరమని చెప్పారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ శాంతికుమార్, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, బీఎస్ అండ్ హెచ్‌వోడీలు డాక్టర్ రమణయ్య, డాక్టర్ రత్నమణి పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన

కంచిలి: పనిగంటల పెంపునకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీ నారాయణలు పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలు, షాపు లు, సంస్థల్లో కార్మికుల పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ కంచిలిలో సోమవారం నిరసన తెలియజేశారు. సీఐటీయూ కంచిలి మండల కన్వీనర్ పిట్ట క్రిష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కప్ప గోపీనాథ్, జయరాం పాల్గొన్నారు.

నేటినుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 800 మందితో పోలీసు బందోబస్తు

టెక్కలి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం.. కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి శతాబ్ది ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక పర్యవేక్షణలో దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది మొట్టమొదటి సారిగా హెలికాప్టర్ రైడింగ్, అమ్మవారి చరిత్ర తెలిపే లేజర్ షో కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలవనున్నాయి. మొదటి రోజు సంగిడి పోటీలు, 24న ఉలవల బస్తాలు ఎత్తే పోటీలు, అమ్మవారి శోభాయాత్ర, లేజర్ షో, 25న భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర, మెగా డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నారు. వీటితో పాటు మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సర్వ దర్శనాలు జరగనున్నాయి.


శతాబ్ది ఉత్సవాలు జరగనున్న అమ్మవారి ఆలయం

పటిష్ట బందోబస్తు: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలకు 800 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వెల్లడించారు. సోమవారం కోటబొమ్మాళిలో అధికారులతో సమావేశం నిర్వహించి విధి విధానాలపై దిశానిర్దేశాలు చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజలతో పాటు పక్కనే ఉన్న ఒడిశా నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, భక్తుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం అధికారులు, సిబ్బందితో ప్రణాళిక రూపొందించామన్నారు.


అధికారులతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

భక్తుల వాహనాలు నిర్దేశించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకునేలా చూడాలని, శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, ఎగ్జిబిషన్, హెలికాప్టర్ రైడింగ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అప్రమత్తంగా విధులు చేయాలని సూచించారు. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యతగా దర్శనం చేయించాలని, రిలీవర్ వచ్చేవరకు నిర్దేశించిన స్థానం నుంచి కదలరాదని, సెక్టారు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ, డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రజలు, భక్తులు ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్పీ కోరారు. టెక్కలి, శ్రీకాకుళం డీఎస్పీలు డి.లక్ష్మణరావు, సీహెచ్ వివేకానంద పాల్గొన్నారు.

● జగన్మాతా నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల ఉత్సవాల కోసం కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో కూడా ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. తొలిరోజు దుర్గాదేవి వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కుంకుమ, అఖండ దీపారాధన పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో కొలువుదీరిన అమ్మవారు


సోంపేట: ఇసకలపాలేం గ్రామంలో కొలువుదీరిన అమ్మవారు


నందిగాం: నీలమణిదుర్గా ఆలయం వద్ద బాలికలకు కుమారి పూజ చేస్తున్న దృశ్యం


టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసి దుర్గాదేవి అవతారాల విగ్రహాలు


పలాస: సూదికొండ కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు


నందిగాం సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద పూజలు చేస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనం


సంతబొమ్మాళి: బోరుభద్రలో నవరాత్రి ఉత్సవాలు


మందస జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి


ఇచ్ఛాపురంలో దీపారాధాన చేస్తున్న భక్తులు


కవిటి: రాజపురం బస్టాండ్‌లో వెలసిన దుర్గామాత

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

సోంపేట: గొల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి ఝాన్సీ అత్త కామమ్మ చనిపోయారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సోమవారం పరామర్శించారు.

కంచిలి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పార్టీ సానుభూతిపరుల కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పరామర్శించారు. గొల్లకంచిలికి చెందిన గణప దుర్యోధన తల్లి గున్నమ్మ, జెన్నాగాయికి చెందిన కొల్లి తాతాజీ, బుడ్డెపు తమ్మయ్య, చొట్రాయిపురం గ్రామానికి చెందిన బడ్డి సీతమ్మల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

దుప్పట్లు పంపిణీ

సంతబొమ్మాళి: లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కింజరాపు శ్రీధర్ ఔదర్యాన్ని చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈయన బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

నేటి నుంచి మంచినీళ్లపేటలో ధార్మిక కార్యక్రమాలు

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజులు ధార్మక కార్యక్రమాలు నర్వహించనున్నారు. ఈ విషయాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి సోమవారం తెలిపారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు భజన, మహారెడ్డి శ్రీనివాసరావు భాగవతార్‌చే ఉపన్యాసం, అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడులో సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి చేతులు మీదగా పలు అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయం చుట్టూ రక్షణగోడ నిర్మాణానికి, సచివాలయ అవరణలో సీసీ ఫ్లోరింగ్ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. ఉప సర్పంచ్ మదనాల మణి, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డి కరుణాకర్, డిల్లేశ్వర రావు, వడ్డి సుందరమ్మ, పి.దీపిక, మాజీ సర్పంచ్ వడ్డి కామరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి.పోలయ్య ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సంతబొమ్మాళి: బడేకుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ ప్రతినిధులు ఇబ్బందు ల్లో ఉన్న పలువురికి సోమవారం ఆర్థిక సా యం చేశారు. సరసాపురం పంచాయతీ ఆకులసతివానిపేట గ్రామానికి చెంది అనారోగ్యంతో బాధపడుతున్న ఇచ్ఛాపురం యోగి కుటుంబానికి రూ. పది వేలు, వడ్డీవాడకు చెందిన కొవ్వూరు చిన్నారావు కుటుంబానికి రూ. పది వేలు చొప్పున సాయాన్ని అందించి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖరావు మాస్టార్, నరసాపురం సర్పంచ్ డి.భూషణ్ రెడ్డి, వై.అప్పన్న, డి.మల్లేసు, పి.రవి తదితరులు పాల్గొన్నారు.